ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి



కాగజ్‌నగర్ : భూ తగాదాలలో తలదూర్చుతున్న చింతలమానేపల్లి ఎస్ఐ విజయ్‌పై చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్ గ్రామానికి చెందిన దుర్గం పుండలీక్ అతని అన్నదమ్ముళ్ల భూతగాదా విషయమై పోలీసుస్టేషన్‌కు వెళితే ఎస్ఐ పుండలీక్‌ను చితకబాది బలవంతంగా ఒప్పంద పత్రంపై సంతకం చేయించాడని ఆరోపించారు. పుండలీక్ కుటుంబసభ్యులు న్యాయం చేయాలని తమను సంప్రదించారని, ఎస్ఐ విజయ్ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఎస్ఐ తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

బుధవారం 05 జులై 2023

ఐటీడీఏ పీవోను కలిసిన కోసుపటేల్‌గూడ గ్రామస్తులు

నవతెలంగాణ-సిరికొండ

ఉట్నూర్ ఐటిడిఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయ్‌ను మంగళవారం కార్యాలయంలో కోసుపటేల్‌గూడ గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆమెకు విన్నవించారు. తమ గ్రామంలో నెలకొన్న సమస్యల గురించి విన్నవించారు. పోడు భూముల కోసం రీసర్వే నిర్వహించి పట్టాలు అందే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యాదవ్‌రావ్, కొమురం రావు, జంగుబాపు, కోసేరావ్, గంగారాం, లక్ష్మణ్, రోహిదాస్ పాల్గొన్నారు.



లబ్దిదారులకు పట్టాలివ్వాలి



నవతెలంగాణ- ఖానాపూర్

సర్వేలో లబ్ధిదారులుగా గుర్తించబడ్డ పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేయాలని సిపిఐ-ఎంఎల్ ప్రజాపంథ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నందిరామయ్య అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే రేఖానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోడు భూముల జాబితాలో తొలగించిన పేర్లను చేర్చాలని, పేర్లను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన రైతులందరికీ న్యాయం చేయాలన్నారు. సెవ్వానాయక్ తండా గ్రామానికి చెందిన సుమారు 50 మంది పేద గిరిజనులు, అడవి సారంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లేడుకుంట సమీపంలో 30 సంవత్సరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి, ఉత్తం, హస్లిబాయి, రాజేష్, రామ్‌చందర్, గణేష్, గంగారాం పలువురు మహిళా రైతులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలకు పట్టాలివ్వాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని భీమన్న గుట్ట మీద గతంలో ఆనాటి ప్రభుత్వం నిరుపేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేశారని, వాటికి పట్టాలు ఇవ్వాలని కోరుతూ లబ్దిదారులు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోహన్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు మాట్లాడుతూ మండల కేంద్రంలోని భీమన్న గుట్ట వద్ద 2006-2007లో ఇంటి స్థలలూ ఆనాటి ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని అన్నారు. గతంలో అక్కడ నీటి సౌకర్యం, కరెంటు సౌకర్యం లేనందున నివాసాలు కట్టుకోలేక పోయామని అన్నారు. ప్రస్తుతం ఒక ఇంట్లో రెండు నుంచి మూడు కుంటుంబాలు నివాసం ఉంటున్నట్టు తెలిపారు, మా స్థలాలు మాకు ఇచ్చి పట్టాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కొత్తూరు లక్ష్మణ్, వార్డు సభ్యులు సిరిసిల్ల భూమయ్య, స్కూల్ చైర్మెన్ అన్నెల లక్ష్మణ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు దుబ్బాక సుభాష్, మచ్చ గంగారాం, కలపెల్లి రాజు, కొత్తూరు లక్ష్మణ్, కాదాస్ మల్లేష్ పాల్గొన్నారు.

ట్రెజరీ శాఖ డీడీని కలిసిన టీఎన్జీవోస్ సభ్యులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల జిల్లా ట్రెజరీ శాఖ డీడీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్. హారికను ఆదిలాబాద్ టీఎన్జీవోస్ యూనియన్ అధ్వర్యంలో సభ్యులు మంగళవారం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు మంజూరయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. ఆమె సానుకూలంగా స్పందించినట్లు టీఎన్జీవోస్ యూనియన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు సంద అశోక్, ప్రధాన కార్యదర్శి ఏ.నవీన్ కుమార్, తిరుమల్‌రెడ్డి, గోపి, రాజేశ్వర్, చంద్ర మోహన్, ప్రవీణ్, గంగాధర్, నారాయణ, అర్బన్ యూనిట్ అధ్యక్షులు మహేందర్, సుజాత, స్రవంతి, అన్నపూర్ణ, సబ్ ట్రెజరీ అధికారి రమణచారి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలి

నవతెలంగాణ - కౌటాల

లోక్ అదాలత్‌లో విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలని ఏఈ రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సమస్యలపై లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. కౌటాల, చింతలమానేపెల్లి, బెజ్జూర్ మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలను లోక్ అదాలత్‌లో పరిష్కరించడానికి జిల్లాస్థాయి విద్యుత్ అధికారులు వస్తున్నారని, ఎలాంటి సమస్యలున్నా తక్షణమే పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎవరికైన విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చినట్లైతే పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-జైపూర్

మంథని నుండి చెన్నూర్ వరకు గల 132 కేవీ లైన్ నిర్మాణపు పనుల్లో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ రవి కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 132 కేవీ లైన్ రెండవ లైన్ పనుల నిర్వహణ కారణంగా భీమారం, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పోడు రైతులకు పట్టాలు పంపిణీ

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని రైతువేదికలో అర్హులైన పోడు రైతులకు పోడు పట్టాలు అందజేస్తామని ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ముఖ్య అతిథిగా పాల్గొని అర్హత కలిగిన రైతులకు పోడు పట్టాలు అందజేస్తారని తెలిపారు.

అట్టహాసంగా ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదిన వేడుకలు

- వెల్లువెత్తిన శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదిన వేడుకలు అట్టహాసంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని జనార్ధన్‌రెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పుట్టిన రోజు వేడుకలకు వందలాదిగా అభిమానులు తరలివచ్చి తమ అభిమాన నాయకునికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. భారీ గజమాలలతో సత్కారాలు, భారీ ఎత్తున తయారు చేయించిన కేక్‌లతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. అటు బీఆర్ఎస్ జాతీయ పార్టీగా రూపుదిద్దిన తర్వాత మహారాష్ట్రలో పలుమార్లు ఎమ్మెల్యే పర్యటించగా అక్కడి నుండి సైతం భారీ ఎత్తున నాయకులు వేడుకలకు హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, అభిమానులు చేరుకొని సందడి చేశారు. ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ముందుగా ఆయా మతాల ఆచారం ప్రకారం ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌కు ఆశీర్వచనాలను అందజేశారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి స్వచ్ఛందంగా రక్తదానం చేసిన అభిమానులకు అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ పలువురు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన పార్టీ శ్రేణులతో కార్యాలయ ప్రాంగణం వద్ద కోలాహల వాతావరణం కనిపించింది. పార్టీ నాయకుడు సాయిని రవికుమార్ భారీ ఎత్తున కేక్ తయారు చేయించి ఎమ్మెల్యేతో కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఫేస్ మస్కులను ధరించి అభిమానులు సందడి చేశారు. మరోవైపు సీఎం కెసిఆర్ ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఉత్తరాలు పంపగా పలువురు రాష్ట్ర మంత్రులు, నాయకులు ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదిన వేడుకలకు తరలివచ్చిన పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తుది శ్వాస వరకు ప్రజాసేవకే పునరంకితం అవుతానని పేర్కొన్నారు. అభిమానంతో తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మెగా రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు హాజరై రక్తదానం చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, మాజీ ఎంపీ గోడం నగేష్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, సాయిని రవికుమార్, మహమ్మద్ అత్తరుల్లా, మెట్టు ప్రహ్లాద్, యూనుస్ అక్బానీ, అష్రఫ్, సాజిదొద్దీన్, స్వరూపరాణి, బొడగం మమతతో పాటు పట్టణ కౌన్సిలర్లు, జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించే విధంగా అధికారులు, రాజకీయ పార్టీల ఏజెంట్ల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం, డిఆర్ఓ రాజేశ్వర్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి తప్పులు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. 18సంవత్సరాల వయసు దాటిన ప్రతి ఒక్కరు తమ ఓటు వివరాలు నమోదు చేసుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉన్న ఓటర్లను సమీప పోలింగ్ కేంద్రానికి మార్చుకునే విధంగా అవకాశం కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల పూర్తిస్థాయి ఏజెంట్లు ఇంటికి వెళుతున్న సందర్భంగా చనిపోయిన, రెండు ఎపిక్ కార్డులు కలిగిన వారి వివరాలను గుర్తించి భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతనంగా నమోదైన ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని, 1300 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రానికి అదనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల సలహాలు సూచనలు పరిగణలోకి తీసుకొని ఓటరు జాబితాలో పేర్లు తప్పులు ఉన్న వాటిని సవరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



వర్షాలతో ఉత్పత్తికి ఆటంకం కల్గొద్దు

- ఉత్పత్తి లక్ష్య సాధనలో ఈ మూడు నెలలే కీలకం
- రోజుకు 2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా
- 14.67లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలి
- సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్



నవతెలంగాణ-జైపూర్

భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తిపై వర్షాల ప్రభావం ఉండదని, ఈ కాలంలో ఎక్కువ ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ సూచించారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఉత్పత్తి కుంటుపడకుండా ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. సింగరేణి భవన్‌లో మంగళవారం సింగరేణి వ్యాప్త ఏరియా జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సింగరేణి లక్ష్యంగా పెట్టుకున్న 75మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడంలో ఈ మూడు నెలలే కీలకమన్నారు. మూడు నెలల్లో రోజుకు 2లక్షల టన్నులకు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి రవాణకు ప్రణాళికలు రూపొందిచుకోవాలని స్పష్టం చేశారు. గతేడాది అతిగా కురిసిన వర్షాలతో 2వ త్రైమాసికంలో అతి తక్కువగా బొగ్గు ఉత్పత్తి జరిగిందని గుర్తు చేశారు. ఈ ఏడాది జూలైలో కొంత వర్ష ప్రభావ పరిస్థితులు ఉన్నందున ఓసీ గనుల్లో నీటి నిల్వ వల్ల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ఇప్పటి నుండే భారీ పంపులను గనుల వద్ద ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. వర్షపు నీటిని ఎప్పటికప్పుడు బయటకు తోడిపోయాలని పేర్కొన్నారు. వర్షాల వల్ల ఓసీ గనుల్లో రవాణాకు ఆటంకం లేకుండా హాల్ రోడ్లను ఎప్పటికప్పుడు పిష్టం చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు నుండి రోజుకు సగటున 7వేల టన్నులకు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి సాధించాలని ఆదేశించారు. ఓసీ గనుల ఓవర్ బర్డెన్ కాంట్రాక్టులను ఇప్పటికే పూర్తి చేసినందున నిర్దేశిత లక్ష్యాల మేరకు ఓబీ తొలగించేందకు ఏజెన్సీల పనితీరును పర్యవేక్షించాలన్నారు. రానున్న వర్షాకాలంలో రోజుకు కనీసం 14.67 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఏరియాల వారీగా బొగ్గు ఉత్పత్తి, రవాణా ఓబీ తొలగింపు నిర్దేశిత లక్ష్యాలను వెల్లడించారు.

కార్మికులకు లాభాల వాటా వెంటనే ప్రకటించాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



కార్మికులకు 11వ వేజ్‌బోర్డు లాభాల వాటాను వెంటనే ప్రకటించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎండి అక్బర్ అలీ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌కె1ఏ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులతో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికుల లాభాల వాటా, 11వ వేజ్ బోర్డ్ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 11వ వేజ్‌బోర్డులో పెరిగిన జీతాలలో ఇన్కమ్ టాక్స్ ఎక్కువ కట్ అవుతుందని, వెంటనే గుర్తింపు సంఘం, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అధికారులకు ఇన్కమ్ టాక్స్‌పై పెరెక్స్ ఎలాగైతే ఇస్తున్నారో కార్మికులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని అన్నారు. అలాగే కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి నాయకులు సిద్ధం బాబు, ఆర్కే1ఏ పిట్ సెక్రటరీ సురమల్ల వినయ్‌కుమార్, కమిటీ సభ్యులు సుంకర గట్టయ్య, సిహెచ్ రమేష్, కొత్తగిరి ప్రసాద్, శ్రీనివాస్, గాజుల రాయమల్లు, బొంకూరు సురేష్, కార్మికులు పాల్గొన్నారు.

గిరిజన మహిళ కుటుంబానికి కలెక్టర్ పరామర్శ



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని చించోలి గ్రామానికి చెందిన గిరిజన మహిళ కుటుంబాన్ని మంగళవారం కలెక్టర్ రాహుల్‌రాజ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తక్షణమే బాధిత మహిళ కుమారుడు భీంరావుకు ప్రభుత్వం తరఫున ఇల్లు కట్టించి, చదువుకు అన్ని విధాలుగా సాయం చేస్తామని తెలిపారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పవన్‌చంద్ర, సర్పంచ్ జంగు, జడ్పిటిసి అనిల్ జాదవ్, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెస్రం మనోహర్ సేవలు మరువలేనివి

- టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక రాఘవులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు దివంగత మెస్రం మనోహర్ సేవలు మరువలేనివని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు అన్నారు. మంగళవారం మండలంలోని లక్కుగూడలో ఆయన ప్రథమ వర్ధంతి జరుపుకున్నారు. ముందుగా ఆయన తల్లిదండ్రులతో కలిసి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ఏజెన్సీలోని ఆదివాసుల చట్టాలపై, వారి హక్కులపై మెస్రం మనోహర్ కృషి చేశారని కొనియాడారు. గిరిజనుల్లో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించడానికి, విద్యా, వైద్యం, పోడు భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. గిరిజన గూడేల్లో రోడ్లు, తాగునీటి సమస్యలపై అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. మనోహర్ మరణం ఆదివాసీ సంఘాలకు తీరని లోటని తెలిపారు. వర్ధంతి కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, మెస్రం నాగోరావ్, మాన్కుబాయి, వసంత్, లక్ష్మణ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని డాడానగర్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూరల్ ఎస్సై సోనియా తెలిపిన వివరాల ప్రకారం... డాడానగర్‌కు చెందిన సిగ కొమురమ్మ(78) మంగళవారం ఉదయం పోచమ్మ టెంపుల్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తోంది. డాడానగర్‌కు చెందిన అబ్దుల్ ముజాహిద్దీన్ వేంపల్లి వెళ్లేందుకు బైక్‌పై బయలు దేరాడు. ప్రమాదవశాత్తు కొమురమ్మను వెనుకనుంచి ఢీకొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు సిగరాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అబ్దుల్ ముజాహిద్దీన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్సై వివరించారు.

కుటుంబీకుల ఆందోళన

మృతురాలి కుటుంబీలు సాయంత్రం కాగజ్‌నగర్ - సిర్పూర్(టి) ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మృతదేహంతో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. నిందితున్ని వెంటనే శిక్షించాలని, తమకు ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సోనియా సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. చట్టపరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఆశ్రమ పాఠశాలల పెండింగ్ మెస్ బిల్లులు చెల్లించాలి



కెరమెరి : 2022-2023 విద్యా సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ మెస్ బిల్లులు చెల్లించాలని అనార్‌పల్లి సర్పంచ్ రాథోడ్ శేషారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలు పున:ప్రారంభమై ఇరవై రోజులు కావస్తున్నా ఆశ్రమ పాఠశాలలకు సరుకులు సక్రమంగా సరఫరా కావడలేదని పేర్కొన్నారు. సరుకుల సరఫరాలో తీవ్ర జాప్యం జర్గుతుండడంతో సంబంధిత ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు విద్యార్థులకు భోజనాలు పెట్టలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. హాస్టళ్లకు సరుకులే సక్రమంగా సరఫరా చేయనప్పుడు విద్యార్థులకు ఏవిధంగా మెనూ ప్రకారం భోజనాలు పెడ్తారని ప్రశ్నించారు. దీంతో కొత్తగా ప్రవేశాలు పొందే విద్యార్థులతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు హాస్టళ్లకు వచ్చి తిరిగి ఇండ్లకు వెళ్తున్నారని తెలిపారు. సొంత ఖర్చులతో గతేడాది కొన్ని నెలల పాటు భోజన ఏర్పాట్లు చేసినప్పటికీ 11 నెలలుగా మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎం, వార్డెన్లకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గిరిజన పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్ మెస్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో రూప్‌లాల్ నాయక్, బదావత్ శివాజీ, బల్వంత్, బాబునాయక్ పాల్గొన్నారు.

ఐకే-1, 1ఏ గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-జైపూర్

ఇందారం-1, 1ఏ గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షులు దీకొండ అన్నయ్య, మంద మల్లారెడ్డి, సింగరేణి చర్చల ప్రతినిది ఏనుగు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గని కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులతో పాటు సౌకర్యాల కల్పన విషయమై సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారు. ఐకే-1ఏ గనిలో 10వ డీప్ నుండి 30వ డీప్ వరకు 2వ మ్యాన్‌రైడింగ్ నడిపించాలని, ఐకే ఓసీ జనరల్ షిఫ్టులో పని చేస్తున్న మజ్దూర్ ఉద్యోగులకు ప్లేడే కల్పించాలని అన్నారు. వాహనాలు నిలుపుకోవడం కోసం అవసరమై స్థలం ఏర్పాటు చేయకపోవడంతో వర్షంలో తడుస్తూ, ఎండలో ఎండుతున్నాయని తెలిపారు. క్రషర్ వద్ద ఉద్యోగుల కోసం షెల్టర్ ఏర్పాటు చేయాలని, గనిపై ఉన్న ఆపరేటర్స్, ఎలక్ట్రీషన్, ఫిట్టర్ రూములను వెంటనే రెన్యూవేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఓసీలో దిగడం కోసం ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గని ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్, డిప్యూటీ జనరల్ మేనేజర్ రవి కుమార్, మేనేజర్ నాగన్నకు వివరించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అధికారులను కలిసిన వారిలో పిట్ కార్యదర్శి గడ్డం మల్లయ్య, ఐకే ఓసీ పిట్ కార్యదర్శి రత్నకర్‌రెడ్డి, బ్రాంచ్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డా.నరేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు దానికి ముందు తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని అన్నారు. వర్షాకాలంలో తడి బట్టలను వేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ సూర్య ప్రకాశ్, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్ఎంలు జమున, ఆరాధన, అనిత, సంగీత, వార్డెన్ కృష్ణారావు పాల్గొన్నారు.



ఆర్జీయూకేటీ వీసీని కలిసిన టీఎస్ఐసీ బృందం సభ్యులు

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణను మంగళవారం తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ బృంద సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. బృంద సభ్యులతో వీసీ వెంకటరమణ మాట్లాడుతూ వచ్చే నెలలో జరుగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్మల్ జిల్లాలో ఇన్నోవేషన్ నూతన ఆవిష్కరణలను ప్రదర్శించేందుకు విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకు వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఇన్నోవేషన్ సెల్ కోఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి, స్వప్నిల్, అసోసియేట్ డీన్ సృజన, పావని, డీన్ చంద్రశేఖర్, టీఎస్ఐసీ బృంద సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుజన ఆత్మగౌరవ సభ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-తాంసి

ఈనెల 17న ఇచ్చోడ మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో నిర్వహించే బహుజన ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో బహుజన ఆత్మగౌరవ సభ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ సృజన్ పాటిల్ మాట్లాడుతూ ఈ సభకు నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి బహుజన ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భగత్ మనోజ్, పాటిల్ సందీప్, సగడం ప్రశాంత్, అలాలి ఉశన్న, పెంటపర్తి నర్సింగ్, బండారి గణేష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని చామన్‌పల్లి, బాబాపూర్ గ్రామాల్లో మంగళవారం ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. చామన్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు. బాబాపూర్ గ్రామంలో సర్పంచ్ శ్రీవిద్య ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నసీరుద్దీన్, ఐకేపీ సిబ్బంది, ఆశా సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో 15మంది విద్యార్థులకు చోటు

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీ ప్రవేశాల జాబితాలో మండల కేంద్రం నుంచి 15మంది విద్యార్థులకు చోటు దక్కింది. మండల కేంద్రంలోని బాలికల పాఠశాల నుంచి-7, కౌట ప్రభుత్వ పాఠశాల నుంచి-4, కిర్గుల్(బి) పాఠశాల నుంచి-4, విద్యార్థినులు ఎంపికయ్యారు. ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీకి ఎంపికైన విద్యార్థులను ఆయా ప్రభుత్వ పాఠశాలల, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను గ్రామస్తులు సత్కరించారు.

విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాకేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ మంజులాపూర్ పాఠశాలలో ఇటీవల బాసర ట్రిపుల్ ఐటీలో ఇద్దరు విద్యార్థులు మారుతి, శివప్రసాద్ మొదటి లిస్టులో సీటు సాధించారు. ఈ సందర్భంగా డీఈఓ రవీందర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. పాఠశాలలోని మన ఊరు, మనబడి పనులను సమీక్షించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల అభ్యసనను పరిశీలించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్ధ పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాలో నరేంద్ర మోడీ పర్యటన నిర్వహించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్‌ను మంగళవారం ఢిల్లీలో ఎంపీ సోయం బాపురావు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధాని నరేంద్ర మోడీ 9 ఏండ్ల పాలనపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని, వెనుకబడిన గిరిజన ఆదిలాబాద్ జిల్లాలో నరేంద్ర మోడీ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. ఈ విషయమై దృష్టి సారిస్తానని తరుణ్ చూగ్ హామీ ఇచ్చినట్టు ఎంపీ తెలిపారు. ఎంపీ వెంట బీజేపీ నాయకులు రాళ్లబండి మహేందర్, రమణ పాల్గొన్నారు.

గ్రీన్ గోల్డ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-బోథ్

గ్రీన్ గోల్డ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. మండల వ్యాప్తంగా గ్రీన్ గోల్డ్ కంపెనీ సోయా విత్తనాలు రైతులు విత్తుకున్నారు. అధిక కాయలు, ఎక్కువ గింజలు పేరుతో దళారులంతా కలిసి కంపెనీతో ఒప్పందం చేసుకొని నాసిరకపు విత్తనాలను రైతులకు అంటగట్టి రైతులను నిలువు దోపిడీ చేశారని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులు మొలకశాతాన్ని చూడకుండా ప్రయోగాలు జరపకుండానే గ్రీన్ గోల్డ్ కంపెనీ లాట్ 202213బి, 32217 మార్కెట్‌లోకి విడుదల చేశారు. అలాగే ఈ విత్తనాలు విత్తి నష్టపోయిన రైతాంగానికి ఒక ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం అందించాలని, డిమాండ్ చేశారు. అలాగే గ్రీన్ గోల్డ్ కంపెనీపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మార్కెట్‌లో ఉన్న గ్రీన్ గోల్డ్ కంపెనీ విత్తనాలను వెనక్కు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులకు, జిల్లా అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు జీడిపల్లి, బోథ్ గ్రామాలకు చెందిన రైతులు నర్సయ్య, మోహన్‌రెడ్డి, గంగాధర్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేష్, నాయకులు గుడాల అనీష్ పాల్గొన్నారు.

ఫసల్ బీమా పథకాన్ని పునరుద్ధరించాలి : బీజేపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సకాలంలో వర్షాలు పడక రైతుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. రైతులు వేసిన విత్తనాలు మొలకెత్తక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కరెంట్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్తు అందించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రైతులు ఇప్పటికే ఎకరానికి రూ.4, 5వేల పెట్టుబడి పెట్టి వర్షం కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. అవసరమైతే విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రతి అసెంబ్లీలో లక్షల ఎకరాలకు సాగు నీరు ఇస్తామని చెప్పిన, ఎక్కడ ఒక ఎకరం అదనంగా తడవలేదన్నారు. పెన్ గంగా ప్రాజెక్ట్ పూర్తి చేయడంలో ఎమ్మెల్యే జోగు రామన్న విఫలమయ్యారని అన్నారు. సాత్నాల ప్రాజెక్ట్ కెనాల్ మరమ్మతు, నిర్వహణ కోసం రూ.4కోట్ల నిధులు ప్రపోజల్ గత ఏడాది ఇచ్చినా, ఇప్పటికి నిధులు మంజూరు కావడం లేదన్నారు. రైతుబంధు ఇచ్చి రైతుకు కావాల్సిన విత్తనాలు ఎరువులు ఆయిల్ ఇంజిన్, స్ప్రింక్లర్స్ మీద సబ్సిడీ పూర్తిగా ప్రభుత్వం తొలగించిందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి శివయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బీజేవైఎం సంతోష్, కొత్తపెల్లి కాంత, రాము, సబ్దర్, పవన్ పాల్గొన్నారు.

ఇప్పట్నుంచి పోడు గోడు ఉండదు

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- ఉట్నూర్‌లో పోడు హక్కుల పత్రాల పంపిణీ
- హాజరైన ఎమ్మెల్యేలు రేఖా నాయక్, రాథోడ్ బాపురావు



నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పోడు వ్యవసాయం చేసుకునే రైతులకు హక్కులు లభించడంతో ఇప్పటి నుంచి పోడు గోడు ఉండదని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల్లో పోడు భూములు సాగు చేసుకునే రైతులకు హక్కు పత్రాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు రేఖ శ్యామ్ నాయక్, రాథోడ్ బాపురావు, జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, మహిళ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. స్థానిక కేబీ ప్రాంగణంలోని కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. అక్కడ నుంచి ఏర్పాటు చేసిన సభావేదికపై మంత్రి, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులను ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్ పాయ్, ట్రైయినీ కలెక్టర్ శ్రీజ, ఐటీడీఏ అధికారులు స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ కోసం పోరాటం చేసిన కుమురం భీం ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులు, గిరిజనేతరులకు అటవీ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 12,222 కుటుంబాలకు 31,683 ఎకరాలు, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 15,254 కుటుంబాలకు 44,750 ఎకరాలు, మంచిర్యాల జిల్లాలో 2,403 కుటుంబాలకు 5,024 ఎకరాలు, నిర్మల్ జిల్లాలో 7,253 కుటుంబాలకు 20,051 ఎకరాలకు అటవీ హక్కు పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పోడు పట్టాలు పొందిన ప్రతి ఎకరాకు రైతుబంధు అందిస్తామని అన్నారు. ఈనెల 8లోగా పట్టాల పంపిణీ పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. గిరిజన ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తున్నదని వివరించారు. ఇకపై రైతులు అడవులను కొట్టి పోడు వ్యవసాయం చేయవద్దని, అటవీ భూములకు హద్దులు ఏర్పాటు చేశారని, కొత్తగా అడవిని నరికితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అడవి తల్లి ఒడిలో పండుగ వాతావరణంలో పోడు పట్టాలను పంపిణీ చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. పోడు భూముల పట్టాల పంపిణీ అనంతరం మీకు ఎలాంటి భయం లేదు, పోడు గోడుకు ఇక వీడ్కోలు. మీ వద్దకు ఇక ఏ అధికారి కూడా రాదని అన్నారు. పట్టాలు అందుకోవడం వల్ల మీకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని, మీపై పెట్టిన కేసులు తొలగించేలా సీఎం వద్దకు తీసుకువెళతామని, వారసత్వ హక్కు భూమిపై వస్తుందన్నారు. పోడు పట్టాలు అందుకున్న వారికి ఇక నుండి ఉచిత విద్యుత్‌తో పాటు 24 గంటలు సరఫరా, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, సబ్సిడీపై పొందుతారని ఆయన స్పష్టం చేశారు. నేటి నుండి తరతరాలుగా అనుభవించడానికి అర్హులయ్యారని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని దశాబ్దాల కళ నేరవేరిందని, దీనికి సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. మాన్యం వీరుడు కుమురం భీం స్ఫూర్తితో సీఎం కేసీఆర్ రాష్ట్రంలో పాలన చేస్తున్నారని అన్నారు. అంతకుముందు సభలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోడు సాగుదారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



లైంగికదాడి, హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి

- బహుజన సంఘాల డిమాండ్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని దనోర(బి) గ్రామంలో ఇటీవల జరిగిన లైంగికదాడి, హత్య నిందితులను కఠినంగా శిక్షించాలని బహుజన సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దళిత, ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ అత్యంత పాశవికంగా ఆదివాసీ మహిళపై హత్యాచారం చేసి హత్య చేసి, ఎవరు గుర్తు పట్టకుండా బావిలో పడేశారని అన్నారు. ఈ ఘటనకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ ఘటన జరిగి 15 రోజులు గడుస్తున్న స్థానిక ఎమ్మెల్యే రేఖా నాయక్ స్పందించకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కాంరాజ్, ఖానాపూర్ నియోజకవర్గ భీమ్ ఆర్మీ అధ్యక్షుడు దత్త, బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శివాజీ, నాయకులు సోయం రాందాస్, సునీల్, ఆర్పీఐ మండల అధ్యక్షుడు బాబాసాహెబ్, భీమ్ ఆర్మీ మండల అధ్యక్షుడు ఉత్తం, తుడుం దెబ్బ మండల ఉపాధ్యక్షుడు గెడం భారత్, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు అతిష్, బీఎస్పీ నాయకులు సుద్ధోధన్, సాయి, దళిత సంఘం నాయకులు ప్రశాంత్ బాబా, సునీల్ పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు ఎన్నటికీ మరువలేము

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు పోరాడిన అమరుల త్యాగాలు ఎన్నటికీ మరువలేమని అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అదనపు కలెక్టర్, అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని ఆయన ఉద్యమ సమయంలో చేసిన సేవలను కొనియాడారు. అమరుల త్యాగలను, పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ గుర్తుచేసుకుంటున్నామని అన్నారు. వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ప్రతి సంవత్సరం అమరుల త్యాగాలను స్మరించుకోవడం కోసం జయంతి, వర్ధంతి కార్యక్రమాలని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాథోడ్ రమేష్, కలెక్టరేట్ ఏఓ అరవింద్ కుమార్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగం, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాజేశ్వర్, బీసీ సంఘం నాయకులు చిక్కాల దత్తు, శంకర్, అనసూయ, ఉమా మహేశ్వరి, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్జీయూకేటీలో కౌన్సెలింగ్‌పై వీసీ సమీక్ష



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో ఈ నెల7వ తేదీ నుంచి నిర్వహించే కౌన్సిలింగ్‌పై యూనివర్సిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం డైరెక్టర్ సతీష్ కుమార్‌తో కలిసి వీసీ వెంకటరమణ సమీక్ష చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించే కౌన్సిలింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు వీసీ, డైరెక్టర్ పలు సూచనలు చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని వైస్ ఛాన్సలర్ వెంకటరమణ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులు పత్రాలను వెంటబెట్టుకొని రావాలని డైరెక్టర్ తెలిపారు.

నాన్ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత...

ఇటీవల మృతి చెందిన యూనివర్సిటీ విద్యార్థిని బూర లిఖిత కుటుంబ సభ్యులకు నాన్ టీచింగ్ అసోసియేషన్ సభ్యులు జమ చేసిన రూ.30వేల చెక్కును యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీష్ కుమార్‌లకు అందజేశారు. రూ.30 వేల చెక్కును బూర లిఖిత కుటుంబ సభ్యులకు అందజేయాలని వారు కోరారు.

ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే లైన్ సర్వే పనులు వేగవంతం చేయాలి

- రైల్వే బోర్డు చైర్మెన్‌ను కలిసిన ఎంపీ సోయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా పటాన్ చెరువు వరకు జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే లైన్ పనులు వేగవంతం చేసి రైలు ప్రయాణం అందుబాటులోకి తేవాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు సోయం బాపురావు కేంద్ర రైల్వే బోర్డుకు విన్నవించారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే బోర్డు చైర్మెన్, సీఈఓ ఎస్‌హెచ్ అనిల్ కుమార్ లోహాటిని కలిసి ప్రధానమైన రైల్వే సమస్యలను విన్నవించారు. ముఖ్యంగా 2017లో మంజూరైన ఆదిలాబాద్ నుంచి పటాన్ చెరువు వరకు రైలు మార్గం సర్వే పనులను వేగవంతం చేసి ప్రయాణ సౌకర్యం మెరుగుపరచాలని కోరారు. రైల్వే లైన్ మంజూరి సర్వే పనుల కోసం ఆరేళ్ల కిందట 4109 కోట్ల బడ్జెట్ మంజూరు కాగా పటాన్‌చెరువు నుంచి బోధన్ వరకు మాత్రమే సర్వే పనులు పూర్తయ్యాయని, ఆదిలాబాద్ ఆర్మూర్ రైల్వే లైన్ సర్వే పనులు వేగవంతం చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

317 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులు పూర్తి అయితే వెనుకబడిన ఆదిలాబాద్ గిరిజన జిల్లాకు, నిర్మల్ జిల్లా ప్రజలకు ముఖ్యంగా వివిధ రకాల పంట ఉత్పత్తులు సాగు చేసే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఎంపీ వివరించారు. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, పాత ఉమ్మడి జిల్లాల ప్రజలకు రైలు సౌకర్యం మెరుగుపడనుందని తెలిపారు. ఈ మేరకు వినతిపత్రాన్ని రైల్వే బోర్డు చైర్మెన్‌కు అందజేశారు. ఎంపీ వెంట రైల్వే బోర్డు సభ్యుడు జీవీ రమణ ఉన్నారు.

నేడు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి మండల స్థాయి పోటీ పరీక్షలు

నవతెలంగాణ-నార్నూర్

స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5వ తరగతుల్లో ప్రవేశానికి మండల స్థాయి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు మంగళవారం ఎంఈఓ ఆశన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయి ఎంపిక పోటీలు బుధవారం మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ స్కూల్ ఆవరణలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నాలుగు, ఐదు తరగతి చదువుతూ ఉండాలని సూచించారు. ప్రవేశ పరీక్ష పోటీలు బాల బాలికలకు ఉంటాయన్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు విధిగా ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో వెంట తీసుకురావాలని సూచించారు. ఫిజికల్ అఫిషియన్సీ టెస్ట్, బరువు, స్టాండింగ్, లాంగ్ జంప్, ఫ్లెక్సిబిలిటీ, వర్టికల్ జంప్, మెడిసిన్ రన్నింగ్ 800 మీటర్లు ఉంటాదని తెలిపారు. పోటీలో పాల్గొనేందుకు వచ్చే విద్యార్థులు టిఫిన్ బాక్స్ వెంట ఇంటి నుండి తీసుకురావాలని అన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లా స్థాయిలో పోటీలకు పంపిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. సంబంధిత వివరాలకు ఎమార్సీలో సంప్రదించాలని కోరారు.

మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదినం సందర్భంగా స్థానిక ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశించిన స్థాయి కంటే అధిక సంఖ్యలో రక్తదానం చేయడానికి నాయకులు, యువకులు ముందుకు వచ్చారు. దీంతో బ్లడ్ బ్యాగ్స్ కొరత ఏర్పడింది. రక్తదానం చేయడానికి అవకాశం లేకపోవడంతో ఈనెల 5న రిమ్స్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంకులో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు బీఆర్ఎస్ నాయకులు మిషు తెలిపారు. అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ బోథ్

మండల కేంద్రంలోని రెవెన్యూ డివిజన్ డీఎస్పీ కార్యాలయం, ఫైర్ స్టేషన్, డిగ్రీ కళాశాల, లైబ్రరీ, నాలెడ్జ్ సెంటర్, మిని స్టేడియం ఏర్పాటు చేయాలని మంగళవారం బోథ్ మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ అవరణలో సీపీఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ బోథ్ పట్టణ కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ కేంద్రమైనప్పటికీ ఉండాల్సిన కనీస సౌకర్యాలు కానీ కార్యాలయాలు కానీ ఇక్కడ అందుబాటులో లేవని అన్నారు. వెంటనే బోథ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బోథ్ నియోజకవర్గ కార్యదర్శి గోవర్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.దాస్, బోజన్న, నరేష్, షకీర్, మున్సీఫ్, ప్రేమ్, సుమేర్ పాషా న్యాయవాదులు, ఆటో యూనియన్ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో సామూహిక లష్కర్ బోనాల వేడుక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ సంస్కృతిలో భాగమైన లష్కర్ బోనాల వేడుకలు జిల్లాలో ప్రారంభమయ్యాయి. ఖత్రి సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక బోనాల సమర్పించారు. సంఘం భవనం నుంచి మహిళలు పెద్ద ఎత్తున బోనాల కుండలతో పోచమ్మ ఆలయానికి బయలుదేరారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఆదిత్య ఖండేష్కర్, ప్రధాన కార్యదర్శి బండేవార్ రాజ్, శ్రీనివాస్, నాయకులు సతీష్, గుజరాతి పవన్, బాబు రాజా, ప్రమోద్ కుమార్ ఖత్రి, నిషిద, మామిడి సంగీత ఉన్నారు.

కరపత్రాలను ఆవిష్కరించిన డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుటుంబ నియంత్రణ అవగాహన పక్షోత్సవ కార్యక్రమ కరపత్రాలను మంగళవారం ఆదిలాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ, డివిజన్‌ల వారీగా కుటుంబ నియంత్ర కార్యక్రమాన్ని సమీక్షించారు. లక్ష్యసాధనలో వెనుకబడి ఉన్న పీహెచ్‌సీలు వెంటనే లక్ష్యాలను సాధించాలని కోరారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సాధన, డీఐఓ వైసీ శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్ విజయసారథి పాల్గొన్నారు.

బోథ్ మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని మర్లపెల్లి సర్పంచ్ కల్లూరి దేవేందర్ మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎంపీపీ తుల శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బోథ్ నియోజకవర్గ కేంద్రమైన బోథ్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎంపీపీ తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, మహిపాల్ పాల్గొన్నారు.

ఏజెన్సీ దళితుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ఏజెన్సీలోని నివాసం ఉంటున్న దళితుల సమస్యలను పరిష్కరించాలని షెడ్యూల్డ్ కులాల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు లాజర్, రాజేశ్వర్ అన్నారు. ఈ మేరకు ఉట్నూర్ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేను వారు కలిసి సమస్యలను విన్నవించి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతమైన ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో దళితులకు ప్రభుత్వం దళిత బస్తీ కింద మూడు ఎకరాల అందజేత పథకాన్ని వర్తింపజేయాలని, దళితులకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించి, దళితులు అన్నింటిలో వెనుకబడి ఉన్నారని అన్నారు. డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని, అర్హులైన వారికి దళితబంధు పథకాన్ని అందించి, ఆదుకోవాలని అన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధికై బ్యాంకుతో సంబంధం లేకుండా రుణాలు మంజూరు చేసి ప్రోత్సహించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఏజెన్సీ సమస్యలను పరిష్కారించే దిశగా కృషి చేస్తానని తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి బదిలీపై వెళ్తున్న శ్రీనివాసరావును మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ఉన్నత పాఠశాలకు గత రెండు సంవత్సరాలుగా తన సేవలు అందించినంతుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పనిచేసిన సమయంలో 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు ఆర్ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ 1వ తరగతి, 5వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల15 లోపు జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆ శాఖ జిల్లా అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటవ తరగతిలో 38 సీట్లు ఐదవ తరగతిలో 40 సీట్లు ఖాళీ ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 20వ తేదీన కలెక్టరేట్ కార్యాలయంలో లక్కీడ్రా ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

మన ఊరు-మన బడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- సమగ్ర శిక్ష రాష్ట్ర సంయుక్త సంచాలకులు పి.రాజీవ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మన ఊరు-మన బడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర సంయుక్త సంచాలకులు పి.రాజీవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మండలంలోని చిర్రకుంట పాఠశాలలో పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పూర్తి అయిన పనులను పరిశీలించారు. పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో తాగునీటి వసతికి సంబంధించిన నల్లాలు పెంచాలని సూచించారు. చిర్రకుంట పాఠశాలలో ఉపాధిహామీ నిధుల ద్వారా చేస్తున్న పనులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల పఠనసామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు జంబోజు సత్తయ్య, రాథోడ్ సుభాష్, ఎం.భరత్ కుమార్, అబీద్ అలీ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వడం చారిత్రాత్మకం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు



నవతెలంగాణ-జైనూర్

గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. మంగళవారం సిర్పూర్(యూ) మండలంలోని శెట్టిహడక్‌నూర్ గ్రామ పంచాయతీలో స్థానిక సర్పంచ్ పెందూర్ సీతారాం, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాష్‌తో కలిసి ప్రభుత్వం నుండి మంజూరైన పోడు భూముల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పటి నుంచి ఎన్నో పోరాటాలు చేసిన అప్పటి ప్రభుత్వాలు పోడు భూముల సమస్యలను పరిష్కరించలేదని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు పూర్తయిన వెంటనే ప్రతి రైతును రాజు చేయాలనే లక్ష్యంగా ప్రతి ఒక రైతుకు న్యాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గిరిజనులకు పోడు భూములకు పట్టాలు అందించడం హర్షనీయమన్నారు. పోడు భూములు పట్టాలు అందించడంతో జిల్లాలోని గిరిజనులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటారని తెలిపారు.

శిల్పారామంలో సింగరేణి స్టాల్

నవతెలంగాణ-రెబ్బెన

హైదరాబాద్‌లోని శిల్పారామంలో సింగరేణి సేవా సమితి సభ్యుల కోసం ఒక స్టాల్ అందుబాటులో ఉంటుందని బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత వృత్తి శిక్షణ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలు ఈ స్టాల్‌ను వినియోగించుకోవాలన్నారు. సేవా సభ్యులు రూపొందించిన కళాఖండాలు, కళా వృత్తులు, వస్తువులు, వంటలు, తినుబండారాలు, పచ్చళ్ల తదితరాలను స్టాల్ ద్వారా అమ్మడానికి అవకాశం ఉందని ఆయన తెలిపారు. 365 రోజుల పాటు అందుబాటులో ఉండే ఈ స్టాల్‌ను సింగరేణి సేవా సమితి సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం బెల్లంపల్లి ఏరియా జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంటులో సంప్రదించాలని తెలిపారు.

మార్లవాయి అభివృద్ధికి సహకరించాలి

- సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్‌రావు



నవతెలంగాణ-జైనూర్

చారిత్రాత్మక గ్రామమైన మార్లవాయి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆ గ్రామ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్‌రావు కోరారు. మంగళవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయిని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి, పుష్పగుచ్ఛం అందించి మార్లావాయి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్లావాయి గ్రామం చారిత్రాత్మక గ్రామం కావడంతో గ్రామాభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. గ్రామంలో ఆదివాసుల ఆత్మబంధువైన ప్రొఫేసర్ హైమన్‌డార్ఫ్, బేటీ ఎలిజబెత్ నివసించడంతో గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా చేసి డార్ఫ్ దంపతుల సమాధులను స్ఫూర్తి వనం చేయాలని పీఓకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా మార్లావాయి గ్రామంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజుకు ప్రభుత్వం నుండి వచ్చిన నివాస గృహం, వ్యవసాయ భూమిని త్వరలోనే ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సార్‌మేడి కనక జుగునాక దేవ్‌రావు, మాజీ సర్పంచ్ కనక పొద్దు, ప్రభాకర్, మాణిక్‌రావు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలి

- ఎంపీడీఓకు సమ్మె నోటీస్ అందజేసిన జీపీ కార్మికులు



నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీ నుంచి గ్రామ పంచాయతీ కార్మికుల నిరవదిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి దుర్గం వెంకటేష్, సీఐటీయూ నాయకుడు రమేష్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌కు జీపీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 50 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలు ఇస్తూ ప్రభుత్వం శ్రమదోపిడీ చేస్తోందని విమర్శించారు. కేసీఆర్ గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే పీఆర్‌సీ మినీమం బేస్ ప్రకారం రూ.19 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఓ నెం.60 ప్రకారం స్వీపర్లకు రూ.15600, పంప్ ఆపరేటర్లకు, ఎలక్ట్రీషన్లకు, డ్రైవర్లకు, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియమించాలని డిమాండ్ చేశారు. జీఓ నెం.51ను సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత కేటగిరీలన్నీ యదావిధిగా కొనసాగించాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన పంచాయతీ కార్మికుడికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. దీనిని పోస్టాఫీసు బీమా పథకం ద్వారా అమలుచేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ప్రమాద బీమా గ్రాడ్యూటీ, గుర్తింపు కార్డు ఇవ్వాలని, దహన సంస్కరణలకు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేయాలని అన్నారు. 8 గంటల పని దినాన్ని అమలుచేయాలని, సెలవులు, వారాంతపు సెలవులు, పండుగ సెలవులు, జాతీయ ఆర్జిత సెలవు దినాలను అమలుచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 6వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా జరిగే సమ్మెలో జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శంకర్, దేవాజీ, లక్ష్మణ్, అంజన్న, లాలుసింగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

10, 11న రెండవ ఏఎన్ఎంల సమ్మె

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో ఎన్‌హెచ్ఎం స్కీంలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 10, 11 తేదీల్లో చేపట్టనున్నట్టు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. మంగళవారం రెండవ ఏఎన్ఎంలతో కలిసి జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కార్యాలయ సిబ్బందికి సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారుగా 20 సంవత్సరాల నుంచి చాలిచాలని వేతనాలు తీసుకుంటూ, పేద, బడుగు బలహీన వర్గాల ఆరోగ్యాన్ని కాపాడటంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆరోగ్య భీమా రూ.పదిలక్షలు కల్పించాలని డిమాండ్ చేశారు. మరణించిన ఏఎన్ఎం కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, సాయంత్రం 6 దాటిన తర్వాత ఎలాంటి పనులు చేయించకూడదన్నారు. పని ఒత్తిడి తగ్గించాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వెంటనే స్పందించి సెకండ్ ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10వ తేదీన చలో హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, నాయకులు పుణ్యవతి, వసంత, రజని, సునీత, శ్రీదేవి, ప్రమీల పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-జన్నారం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కూకటికారి బుచ్చయ్య అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులతో ఎంఈఓ విజయ్ కుమార్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు 2022 మార్చి బడ్జెట్ సమావేశాల సందర్భంగా వేతనాలు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించినప్పటి నుంచి ఏరియర్స్‌తో సహా జీఓ నెం.8 ప్రకారం ఇప్పటివరకు వారి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త మెనూ సవరించాలని, పెండింగ్ బిల్లులు తక్షణం విడుదల చేయాలన్నరు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అక్షయపాత్రకు అప్పచెప్పడాన్ని విరమించుకోవాలన్నారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో మూడు రోజులు మధ్యాహ్న భోజన కార్మికులు వంట బందు పెట్టి టోకెన్ సమ్మె చేస్తున్నామని హెచ్చరించారు. అప్పటివరకు కూడా ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 14వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 54,201 మంది, 25 వేల పాఠశాలల్లో, 24 లక్షల మంది విద్యార్థులకు, మధ్యాహ్న భోజన కార్మికులు భోజనం వండి పెడుతున్నారని, పెరిగిన ధరలతో పోల్చితే గతంలో కేటాయించిన బడ్జెట్, సరిపోవటం లేదన్నరు. మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరినారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జువ్వాడి వసంత, అమృత, సేపూరి లక్ష్మి, జుంబర్తి లక్ష్మి, ఎలుక లక్ష్మి, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ప్లకార్డులతో నిరసన



నవతెలంగాణ-రెబ్బెన

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమంలో భాగంగా కాంట్రాక్టు కార్మికులు మంగళవారం ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు ఎ ఓదెలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 9 సంవత్సరాల నుండి కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాల జీఓను సవరించడంలేదని, ధరలు పెరుగుతున్నా వేతనాలు పెంచడం లేదని అన్నారు. సింగరేణిలో 25 వేలకుపైగా కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా బొగ్గు ఉత్పత్తిలో పాల్గొంటున్నారని, సింగరేణికి వచ్చే ప్రతి పైసా లాభంలో కాంట్రాక్టు కార్మికుల వాటా ఉంటుందన్నారు. అయినప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. కోలిండియాలో పనిచేస్తున్న అన్‌ఫిల్డ్ కాంట్రాక్టు కార్మికుడికి రోజుకు రూ.1042 చెల్లిస్తున్నారని, సింగరేణిలో మాత్రం కాంట్రాక్టు కార్మికులకు కేవలం రూ.490 మాత్రమే చెల్లించడం అన్యాయమన్నారు. కోల్‌బెల్టు ప్రాంతాలైన రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్‌లో పర్యటించిన కేటీఆర్, కేసీఆర్ కాంట్రాక్టు కార్మికుల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం చాలా బాధకరమైన విషయమన్నారు. అందుకే కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెరుగుదలకై సీఐటీయూ నాయకత్వంలో పోరుబాట చేపట్టిందని, ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తేవడంతో పాటు జీఎం కార్యాలయాల ఎదుట ఈ నెల 14న ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. అదేవిధంగా కలెక్టర్ కార్యాలయం ముట్టడించడం, తదితర ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, అవసరమనుకుంటే మరో సమ్మె పోరాటానికైనా సిద్ధమేనని ఓదెలు అన్నారు. కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) నాయకులు సిద్దెంకి సత్తయ్య, కార్మికులు బాలేష్, గోపాల్, సుమలత, ఎం రాజేష్, దీపక్, రాజు, డేగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

- తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు కోవ విజయ్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జల్ జంగల్ జమీన్ కోసం పోరాటం చేసిన కుమురంభీం నడయాడిన నేల జోడేఘాట్‌లో నిర్మిస్తున్న బృహత్ పల్లె ప్రకృతి వనంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బృహత్ పల్లె ప్రకృతి వనంలో 18 వేల మొక్కలు నాటినట్లు రికార్డ్‌లో నమోదు చేసి రూ.లక్షలు అధికారులు అక్రమంగా కాజేశారన్నారు. బృహత్ పల్లె ప్రకతి వనంలో కేవలం రెండు వేల మొక్కలు మాత్రమే ఉన్నాయన్నారు. పల్లె ప్రకృతి వనం పేరుతో సంబంధిత అధికారులు తీవ్ర అవినీతి చేస్తున్నారని ప్రభుత్వాన్ని మోసం చేసి డబ్బులు స్వాహా చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో సంబంధిత అధికారులు బినామీ పేర్లతో వర్క్ ఐడీలు చేసుకొని గ్రామ పంచాయితీలోని మల్టీ పర్పస్ వర్కర్లతో పని చేయించుకొన్నారన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ చేపట్టి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం పోరు గ్రామాల అధ్యక్షుడు పెందూర్ రాజేశ్వర్, ఆదివాసీ జిల్లా నాయకులు ఆత్రం రాజేశ్వర్, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పార్టీ కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు మహంకాళి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలో బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల బూత్ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, బీజేపీ ఐటి సెల్ సోషల్ మీడియా, మండల అధ్యక్షుడు మాట్లాడుతూ నరేంద్రమోదీ 9 సంవత్సరాల సేవ సుపరిపాలన పేదల సంక్షేమం, అభివృద్ధి గురించి కార్యకర్తలకు వివరించారు. తెలంగాణలో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని, ప్రతిరోజూ ప్రజలకు దగ్గరగా ఉంటు మోదీ సుపరిపాలన గురించి సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని అన్నారు. అనంతరం భారతీయ జనతా పార్టీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యాలయం నుంచి రామాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆరుముళ్ల పోశం, ఐటి సెల్ సోషల్ మీడియా మండల ఇన్‌ఛార్జి వేముల అశోక్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎల్పుల సత్యనారాయణ, సీనియర్ నాయకులు దండు రాజేందర్, ముద్దసాని శ్రీనివాస్, వీరమల్ల పాలరాజు, వైద్య శ్రీనివాస్, బంగారి ప్రసాద్, ఓరగంటి సాయి, శ్యాం, బద్రి సతీష్, మహిళా మోర్చ పట్టణ అధ్యక్షురాలు మేదరి లక్ష్మీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులను మంగళవారం మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు.11వ, 22వ వార్డులలో రూ.18లక్షల నిధులతో మురికి కాలువలు, సీసీ రోడ్లు, స్లాబ్ కల్వర్ట్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ వంగ తిరుపతి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బయ్య, కౌన్సిలర్లు మర్రి రాజమౌళి, బౌతు లక్ష్మి, కోఆప్షన్ సభ్యులు నాజర్, పార్టీ కార్యదర్శి మెరుగు పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

ఆడపడుచులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడు ఉంటుందని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 55 మంది లబ్దిదారులకు మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, తాహసిల్దార్ జ్యోతి పాల్గొన్నారు.

సీఎంపీఫ్ అమలుపై కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలోని కాంట్రాక్టర్లతో కాంట్రాక్టు ఉద్యోగులకు సీఎంపీఎఫ్ అమలు చేయు విధానం సంబంధించి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫిరెన్స్‌హాల్‌లో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సీఎంపీఎఫ్ అమలు చేయాలని సింగరేణి సంస్థ, న్యాయస్థానం నుండి ఆదేశాల మేరకు మే ఒకటవ తేదీ నుండి అమలు చేయడానికి కాంట్రాక్టర్లందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం రఘు కుమార్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీ మోహన్, డీవైపీఎం వి దేవేందర్‌రెడ్డి, సంక్షేమ అధికారి శంకర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ భవాని పాల్గొన్నారు.

అనుదినం జనహితం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 05 జులై 2023

మున్సిపల్ అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్



మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుపై మంగళవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. టీయూఎఫ్ ఐడీసీ స్కీంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ధర్మసాగర్ కట్టపై జరుగబోవు అభివృద్ధి పనుల గురించి పలు సూచనలు ఇచ్చారు. పట్టణ శివారు ప్రాంతంలోని డంపింగ్ యార్డును, పట్టణంలో చేపడుతున్న పారిశుద్ధ పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, టీపీఓ సుమలత, ఏఈ హరిభువన్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవదాస్, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం ఉదయం కాగజ్‌నగర్ పట్టణంలో జరిగింది. మృతురాలి బంధువులు తెలిపిన ప్రకారం స్థానిక ఆదర్శనగర్‌కు చెందిన తన్నీరు సుశీల (58) తనింట్లో ఒక్కతే నివసిస్తోంది. రాత్రి సమయంలో ఆన్ చేసి ఉన్న కూలర్‌ను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై కింద పడింది. కూలర్ కూడా ఆమె మీద పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మంగళవారం ఉదయం కాలనీవాసులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలికి నలుగురు కుమారులు, ఒక కూతురు ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి



నవతెలంగాణ-బేల

గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్‌లను పరిష్కరించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. నాటి నుండి గ్రామపంచాయతీ కార్మికులు 11వ పీఆర్సీని వర్తింపజేయాలని పోరాటాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి నిత్యం కృషి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం మెమో నెంబర్ 48ని తీసుకువచ్చి పాఠశాలలను ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు పని భారం వేసిందని అన్నారు. జీఓ నెంబర్ 51 తీసుకువచ్చి కార్మికుల పని భద్రతను దూరం చేసి మల్టీపర్పస్ వర్కర్స్‌గా మార్చివేసి పని భారాన్ని పెంచిందని అన్నారు. కార్మికులకు రూ.2లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని సీఎం కేసీఆర్ హామీనిచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొజ్జ ఆశన్న, బేల మండల నాయకులు వాగురావు, సంతోష్, లచ్చన్న, ఆశన్న, అశోక్, దేవరావు, రమేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే 6నుండి నిరవధిక సమ్మె

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామపంచాయతీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం శ్రమదోపిడీకి గురిచేస్తుందని, కార్మికుల సమస్యలు పరిష్కరించకటే ఈ నెల 6నుండి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి దివాకర్, బీఆర్ఎస్‌కెవి నాయకులు నగేష్ అన్నారు. మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో ఎంపీడీవో శశికళ, ఎంపీఓ ప్రసాద్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం జులై 6నుండి జరిగే నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కార్మికులకు పిఆర్సి 30శాతం పెంచాలని, పిఆర్సి కనీస వేతనం ప్రకారం రూ.19వేల జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 60 ప్రకారం స్వీపర్లకులకు 15600 పంపు ఎలక్ట్రీషియన్, ఆపరేటర్లు, డ్రైవర్లు, కారోబార్, బిల్ కలెక్టర్లకు 19500 చెల్లించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియమించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 51ను సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత కేటగిరీలన్ని యధావిధిగా కొనసాగించాలని కోరారు. విధినిర్వహణలో మరణించిన పంచాయతీ కార్మికునికి రూ.10లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇవ్వాలని, దీన్ని పోస్ట్ ఆఫీస్ బీమా పథకం ద్వారా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మిక కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీ కార్మికునికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ప్రమాద బీమా, గ్రాట్యూటీ, గుర్తింపు కార్డు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలన్నారు. జూలై 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా జరిగే సమ్మెలో జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మికులు ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కెరమెరి : జీపీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డల వెంకటేశం ఆధ్వర్యంలో ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్‌కు సమ్మె నోటీస అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 6 నుండి సమ్మెలోకి దిగుతామని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రామిల్ల సరేష్, సంతోష్, రవి, మల్లేష్, పుల్లయ్య పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని చిమ్మన్‌గుడి గ్రామంలో ముందస్తు సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కిరాణా దుకాణంలో గుడుంబా విక్రయిస్తున్నారని పక్క సమాచారంతో తనిఖీ చేయగా 7లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.3500 వరకు ఉంటుందని తెలిపారు. గుడుంబా విక్రయించిన జాదవ్‌శ్రీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన గుడుంబాను ఎవరైన విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నిరేశ్ అన్నారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు ప్రకాష్, భరత్ ఉన్నారు.

పీడీని సన్మానించిన ఐటీడీఏ డీడీ



నవతెలంగాణ-ఉట్నూర్

స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా పోటీల్లో బాక్సింగ్ కోచ్‌గా శిక్షణ పూర్తి చేసిన పీడీ రాథోడ్ గోపాల్‌ను మంగళవారం ఐటీడీఏ డీడీ డాక్టర్ దిలీప్ కుమార్ స్థానికంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ ఎన్ఐఎస్‌లో బాక్సింగ్ కోచ్‌గా జాతర్ల క్రీడా పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ గోపాల్ శిక్షణ పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు. దీని వల్ల ఏజెన్సీలోని గిరిజన విద్యార్థులు బాక్సింగ్ పోటీలలో రాణించేందుకు అవకాశం ఉందన్నారు. బాక్సింగ్ కొరకు తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ భీంరావ్, ఏసీఎంఓ జగన్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పీడీలు హెమంత్, మధుసుదన్, శ్రీనివాస్, రవీందర్ ఉన్నారు.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం



నవతెలంగాణ-తలమడుగు

ఐక్యతతోనే సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆదివాసీ నాయక్ పోడు సేవా సంఘం మండల అధ్యక్షులు దేవర పోచ్చన్న అన్నారు. మంగళవారం మండలంలోని సాయి లింగి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని కోరారు. అదేవిధంగా మండలంలోని ప్రతి ఒక్క నాయక్‌పోడు కులస్తులకు ఏ సమస్యలున్నా ఐక్యంగా ఉండి పరిష్కరించుకోవాలని సూచించారు. అదేవిధంగా మండలంలోని భీమన్న దేవాలయాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో లింగి సర్పంచ్ జంగాల రేవతి, అర్లి(కె) సర్పంచ్ నారా కిష్టన్న, సంఘ నాయకులు కాంతారావు, మాజీ సర్పంచ్ దంతే రమేష్, మాజీ ఎంపీటీసీ నాగయ్య, మాజీ ఎంపీటీసీ సుంకిడి భీమన్న, వెంకన్న, నీలగిరి అశోక్ పాల్గొన్నారు.

ముధోల్ : మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతా రామరాజు చిత్రపటానికి పూలమాలలు వేశారు. ప్రధానాచార్యులు సారథి రాజు సీతా రామరాజు జీవిత వృత్తాంతాన్ని వివరించారు. విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసికొని సమాజంలో ఎదురవుతున్న అన్యాయాలను తొలగించాలని సమ సమాజ నిర్మాణానికి కంకణబద్ధులు కావాలని మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- జులై 10,11,12 టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్



నవతెలంగాణ - హాజీపూర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు ధర్నా చేసి అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పదేపదే రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించలేదని పేర్కొన్నారు. జులై 10,11,12 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం బంద్ చేపడుతున్నామని, జులై 13వరకు ప్రభుత్వం స్పందించకపోతే జులై 14 తర్వాత సమ్మెలోకి వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పెంచిన గౌరవ వేతనాన్ని నెలలు గడిచినా ప్రభుత్వం ఇప్పటిదాకా చెల్లించలేదన్నారు. జీవో 8 ప్రకారం పెరిగిన వేతనాలను ఎరియర్స్‌తో సహా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వెంటనే మెనూ చార్జీలు పెంచాలన్నారు. ప్రతి కార్మికురాలికి ఐడి కార్డు, యూనిఫాం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దాసరి రాజేశ్వరి, కావేరి రవి, పద్మ, అంజలి, అరుణ, లక్ష్మి, గట్టమ్మ పోసక్క, భాగ్య అనసూయ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మొదటి బహుమతి



నవతెలంగాణ-నార్నూర్

జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండలంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సమర్థ్ బాలాజీ మొదటి బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నప్పరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు రూ.10వేల బహుమతి అందించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివిన జాదవ్ సుమీత్, రాథోడ్ అయ్‌రాజ్, రాథోడ్ నిఖిల్ బాసర ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించినట్లు తెలిపారు. సీటు సాధించిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

కొత్త జీతాలతో ఆనందంలో కార్మికులు

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య



నవతెలంగాణ-నస్పూర్

11వ వేజ్‌బోర్డు సాధించుకొని కొత్త జీతాలతో కార్మికులు ఆనందంలో ఉన్నారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య ఉన్నారు. మంగళవారం ఆర్కే5 గనిలో శ్రీరాంపూర్ ఏరియా సహాయ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి గని కార్మికులతో పాటు కోల్ ఇండియా కార్మికులు 11వ వేజ్ బోర్డును సాధించుకొని ఆనందంలో ఉన్నారని, వేజ్ బోర్డు సాధన గని కార్మికుల ఐక్యత, జాతీయ సంఘాల సమిష్టి కృషి వల్లనే సాధ్యమైందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్యల నేపథ్యంలో వేజ్ బోర్డును సాధించామన్నారు. దేశంలో ఏ రంగంలో కూడా ఇలాంటి వేజ్ రివిజన్ జరగలేదని, దేశంలో ఉన్నటువంటి అన్ని వర్గాల కార్మికులు ఈ వేజ్ బోర్డు సాధనను ఆస్వాదిస్తున్నారన్నారు. కొందరు అధికారుల కంటే కార్మికుల జీతాలే ఎక్కువగా ఉన్నాయని, జీతాలు ఆపాలని కొందరు యత్నించాకరని తెలిపారు. కానీ కోల్ ఇండియా చైర్మన్ సమయస్ఫూర్తితో వ్యవహరించి కార్మికుల జీతాలను ఇంప్లిమెంటేషన్ చేయించారని తెలిపారు. కోల్ ఇండియా అధికారులు కోర్టుకెళ్లి కార్మికుల జీతాలను ఆపాలని చూస్తున్నారని, ఇది ఎంత మాత్రం సమంజసం కాదని తెలిపారు. 11వ వేజ్‌బోర్డ్ ఎరియర్స్ ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా పేమెంట్ చేయించాలని, సింగరేణి ఎన్నికలను కుట్రలు, కుతంత్రాలతో ఆపకుండా వెంటనే నిర్వహించాలని పేర్కొన్నారు. మహిళా డిపెండెంట్‌లను అండర్ గ్రౌండ్ గనుల్లోకి దించే ప్రక్రియను రద్దు చేసుకొని సర్ఫేస్ డిపార్ట్మెంట్లోనే ఉద్యోగాలు కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపిఎఫ్ లెక్కలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, కాంట్రాక్ట్ కార్మిక సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఆర్కే-5 ఫిట్ కార్యదర్శి రంగిశెట్టి శ్రీనివాస్, నంబయ్య, మల్లేష్, బాలయ్య, పృథ్వి, సురేష్, చైతన్య, జిపి రావు, మధు, రవి, రాజమౌళి పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళులు



నవతెలంగాణ-నిర్మల్

సమీకృత కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో మంగళవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్ఓ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వివేకానంద సూక్తి పుస్తకాలు అందజేత

నవతెలంగాణ-నిర్మల్

మండలంలోని కొండాపూర్ శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు వివేకానంద సూక్తి పుస్తకాలను బోథ్ పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు కౌటిక శ్రీనివాస్ మంగళవారం అందజేశారు. విద్యార్థులు వివేకానందుని బాటలో ఆత్మవిశ్వాసంతో ఉండి చదువుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరప్రసాద్, సాయిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నవతెలంగాణ-ముథోల్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ సురేష్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని మచ్కల్ గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఒక్కరికి ఆరు మొక్కలు చొప్పున పంపిణీ చేశారు. ప్రతిమొక్క వృధా కానివ్వకుండా బాధ్యతగా పెంచాలని అన్నారు. మొక్కలే మానవ జీవనానికి ఆధారమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశ్విని మైసాజీ, ఏపీఓ శిరీషరెడ్డి, టీఏ భాస్కర్‌రెడ్డి, మహిళా సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజనులకు గిరిజనబంధు అమలు చేయాలి

- కలెక్టర్‌కు సేవాలాల్ సేన నాయకుల వినతి



నవతెలంగాణ-కెరమెరి

గిరిజనులకు గిరిజనబంధు అమలు చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగులోతు రవి నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ హేమంత్ బోర్కుడెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు చాలా మంది ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి గిరిజన బిడ్డకు ఉన్నత విద్య అందాలంటే గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని విన్నవించారు. గిరిజనులకు గృహబంధుప పథకాన్ని అమలు చేయాలన్నారు. అదేవిధంగా పోడు పట్టాలు రానటువంటి రైతులు మరోసారి సర్వే నిర్వహించి ప్రతి పోడు రైతుకు పట్టాలు అందేలా కృషి చేయాలని వినతిపత్రంలో విన్నవించారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన వారిలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు రాథోడ్ రూప్‌లాల్ నాయక్, రెబ్బెన మండల అధ్యక్షులు జరుపుల తిరుపతినాయక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



నవతెలంగాణ-నస్పూర్

వర్షాకాలం ప్రభావరీత్యా ప్రబలే వ్యాధుల పట్ల ఎస్ఆర్‌పి 3,3ఏ గనిపై మంగళవారం డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులకు చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దరిచేరనివ్వకుండా చూడవచ్చని తెలిపారు. దోమల నివారణకు ఇంటి లోపల, బయట పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పారిశుధ్యం పాటించాలని తెలియజేశారు. వివిధ రకాల జాగ్రతల గురించి అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్‌రావు, అడిషనల్ మేనేజర్ మహేందర్, డిప్యూటీ మేనేజర్ చంద్ర ముర్మ్, డివైఎస్ఈ మర్రి రమేష్, డివైస్-ఎస్ఈ (ఈ అండ్ఎం) ప్రేమ్‌కుమార్, వెంటిలేషన్ ఆఫీసర్ అరుణ్‌కుమార్, ఇంజనీర్ సాయిశ్రావణ్ పాల్గొన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌పి 3,3ఏ గనిలో భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా రక్షణ సూత్రాలు పాటించి ఉత్పత్తి సాధించాలని రక్షణ అధికారి శ్రీధర్ తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో మంగళవారం శ్రీ కొత్తపల్లిత వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 16 మందికి పరీక్షలు నిర్వహించగా, తొమ్మిది మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేజీబీవీ సీఆర్టీల డిప్యూటేషన్ రద్దు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న సిఆర్టిల డిప్యూటేషన్ రద్దు చేయాలని పిఆర్టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, ఆడే ప్రకాష్ కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలోని కౌటాల, కెరమెరిలో పనిచేస్తున్న ఇద్దరు సిఆర్టిలను ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్ మీద పంపించారని, రద్దు చేసి వారిని అదే పాఠశాలల్లో కొనసాగించాలని కోరారు.

విద్యార్థులు ప్రశంసా పత్రాలు అందజేత

నవతెలంగాణ-ముథోల్

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో, ఎస్బీఐ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఐతే జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులో ముథోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గాయత్రి, వినాయక్‌లు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రదానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు రూ.7వేల500తో పాటు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

ముత్యంపల్లి గ్రామ పంచాయతీని పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని ముత్యంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యదర్శి విధులకు ఎందుకు హాజరు కాలేదని అడగగా ఇతర పనులకు వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, సర్పంచ్ ఆడె బాదు, ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, టీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని కొండాపూర్ యాపలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ సంధర్భంగా ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ సీసీ కెమెరాలు లేని ప్రాంతంలో ప్రజలు ముందుకు వచ్చి ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీసీ కెమెరాల ద్వారా ప్రజలకు మరింత రక్షణ కల్పించవచ్చన్నారు.

విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలి

- టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామిల్ల మహేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడితప్పిందని గాడిలో పెట్టి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు ప్రయివేటు పాఠశాలల దోపిడిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామిల్ల మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన టీఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభమై దాదాపు నెల రోజులు కావస్తున్న ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బంగారు తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు దిక్కులేవన్నారు. దీనితో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో అనేక పాఠశాలలు వర్షం పడితే ఊరుస్తాయని, బాలబాలికలకు సరైనా వసతి గల మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడాల్సిన దుస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' కార్యక్రమానికి సముచిత నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడాలని లేని పక్షంలో విద్యార్థులను వారి తల్లిదండ్రులను కలుపుకొని ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చౌహాన్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నవతెలంగాణ-రెబ్బెన

ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో అమలు అవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీరా ఆత్మారాంనాయక్ సూచించారు. మంగళవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి ఆధ్వర్యంలో పార్టీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆత్మారాంనాయక్ మాట్లాడుతూ గడపగడపకు బీజేపీ అనే కార్యక్రమం ద్వారా దేశంలో అవలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విశిష్ట అతిథిగా వచ్చిన ఆనంద్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, బెల్లంపల్లి ప్రబారి అన్నపూర్ణ సుదర్శన్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్ చౌదరి, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మల్రాజ్ రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శులు జగన్నాథ ఓదెలు, చేకూరి నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదిన వేడుకలు



ఆదిలాబాద్ రూరల్: అదిలాబాద్, మావల, మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యే జోగు రామన్న దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యేకు పూలమాల వేసి శాలువాతో సత్కరించి కేక్‌కట్ చేయించి తినిపించారు. అంకోలి, తంతోలి, పిప్పల్‌దరి, చించుఘట్, కచ్‌కంటి, పొచ్చర, దిమ్మ అర్లి, లాండసాంగి, న్యూరాంపూర్, ఖండాల, చాంద(టి) గ్రామాల ప్రజలు, ఎంపీపీ గంద్రత్ రమేష్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు, మాజీ సర్పంచ్ బొజ్జ అడెల్లు, ఉపసర్పంచ్ సుదర్శన్, అంబేద్కర్ సంఘం సభ్యులు, సర్పంచ్ పెందూర్ గంగారాం. ఇటికల భూమన్న. బీఆర్ఎస్ నాయకులు కుమ్ర రాజు, వైస్ ఎంపీపీ జంగు పటేల్, సెవ్వ జగదీష్ యాదవ్, గొర్ల సంఘం నాయకులు గంగయ్య యాదవ్, కనక రమణ పాల్గొన్నారు.

తహసీల్దార్ నూతన కార్యాలయ భవన నిర్మాణం చేపట్టాలి

బోథ్ : శిధిలావస్థలో ఉన్న తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని నిర్మించాలని, బీజేపీ మండల అధ్యక్షుడు సుభాష్, సూర్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక బీజేపీ కార్యాలయంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని అన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీగా ప్రకటించాలని, ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిన ప్రభుత్వ కార్యాలయలను బోథ్‌లోనే ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గ కేంద్రానికి నాలుగు వరుసల రహదారి, వెంకటేశ్వర టెంపుల్ నుంచి బోథ్ పట్టణం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాల నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లాడేవార్ తుకారాం, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల వెంకటేష్, పట్టణ అధ్యక్షులు సల్ల రవి, బోథ్ అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ బోరే రవీందర్, నాయకులు తలంపుల రమేష్, ఓస సాయి, తూము సంతోష్, మాడి నారాయణ, సాయిరెడ్డి పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళ్లు

ఎంచికల్‌పేట్ : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సరిత మంగళవారం దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌లు గోపాల్, సురేష్, ఏఎస్ఓ దామోధర్, వాసిం, సంతోష్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

పిడుగుపడి ఒకరు మృతి

రెబ్బెన : మండలంలోని నవెగాం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బోయిని మల్లేష్(35) మంగళవారం మేకలను మేపడానికి వెళ్లగా మధ్యాహ్నం వర్షం కురవడంతో పిడుగుపడి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికుల

ఒప్పందాలు అమలు చేయాలి

- జీఓ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి కాంట్రాక్టు కార్మికుల అగ్రిమెంట్ అంశాలను అమలు చేయాలని, జీఓ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల కుమారి, గట్టు మహేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ప్లాకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా సుమారుగా 25 వేల పైచిలుకు కార్మికులు కాంట్రాక్టు కార్మికులుగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి సరైన వేతనాలు లేక, పని భద్రత, ఇతర సౌకర్యాలు లేక అనేక దఫాలుగా పోరాటాలను చేస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 26న 18 రోజులపాటు వీరోచితమైన సమ్మెను చేయడం జరిగిందని, సమ్మెలో ప్రధానంగా 12 డిమాండ్లపై సింగరేణి యాజమాన్యం ఆర్ఎల్‌సీ ఆధ్వర్యంలో ఒప్పందం జరిగిందన్నారు. పది నెలలు గడుస్తున్న ఇప్పటికీ పూర్తిస్థాయిలో అగ్రిమెంటులోని అంశాలను పరిష్కరించలేదని విమర్శించారు. అందులో ముఖ్యంగా బోనస్ 20 శాతం పెరుగుదల గురించి, కుటుంబ సభ్యులందరికీ వైద్య సదుపాయం, కేటగిరి వారిగా గుర్తించడం, పండుగ సెలవులు, ప్లేడేలు ఇతర అంశాలను పరిష్కరించాల్సి ఉన్న పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అదేవిధంగా గత నాలుగు సంవత్సరాల నుండి సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికుల సీఎంపీఎఫ్ వివరాలను వారికి పాస్ పుస్తకాలను ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని డిమాండ్ చేశారు. యాజమాన్యం సమస్యలను వెంటనే సానుకూలంగా స్పందించి, పరిష్కరించాలని లేదంటే కాంట్రాక్టు కార్మికులు మరో పోరాటానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళ, సరోజన, లక్ష్మి, స్వరూప, సంపత్, సురేష్, నాగరాజు, రంజిత్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌ను ఎదుర్కొలేక చిల్లర రాజకీయాలు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- కాసిపేటలో పోడు పట్టాల పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట



బీఆర్ఎస్‌ను ఎదుర్కొలేక చిల్లర రాజకీయాలు, కుట్రలు చేస్తూ కాంగ్రెస్, బీజేపీలు పబ్బం గడుపుకుంటున్నాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పోడు భూముల మంజూరైన పట్టాలను లబ్దిదారులకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పాలిస్తున్న రాష్ట్రాల్లో కనీస పింఛన్ ఇవ్వడం లేదు కాని ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో రూ.4 వేలు పింఛన్ ఇస్తామని హామీలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు పాలిస్తున్న ఏ రాష్ట్రాల్లో కూడా సరిగ్గా పింఛన్ ఇవ్వడం లేదని, లేనిపోని ఆరోపణలు చేస్తూ కుట్రలు చేస్తూ పబ్బం గుడుపుకుంన్నాయని విమర్శించారు. తెలంగాణాలో ఉన్న పథకాలు దేశంలో ఏ రాష్ట్రాల్లోలేవన్నారు. అనంతరం కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో 2403 మందికి 5400 ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇస్తామన్నారు. పట్టాలిస్తున్న వారికి వెంటనే రైతు బంధు ఇవ్వడం జరుగుతుందని, బ్యాంక్ ఖాతాలు ఇవ్వని వారి వివరాలు తీసుకొని రైతు బంధు పథకం వర్తింప చేసే విధంగా చూస్తామన్నారు. ఒకే పంట కాకుండా పంటలను మార్పిడి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పత్తి, వరి మాత్రవే వేస్తున్నారని, అలా కాకుండా పంటలను మార్పిడి చేసుకుంటే మంచిదన్నారు. పట్టాలు అందుకున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రేనీ కలెక్టర్ గౌతమి, ఆర్డీఓ శ్యామలా దేవి, జడ్పీటీసీ చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రంరావు. ఎంపీడీఓ ఎంఏ అలీం, తహసీల్దార్ దిలీప్ కుమార్, రైతు బంధు అధ్యక్షుడు దుర్గం పోశం, సర్పంచ్‌లు ఆడె బాదు, రాంటెంకి శ్రీనివాస్, ఆడె జంగు, అజ్మీర తిరుపతి, ధరావత్ నీలా, సంపత్ నాయక్, భూక్య సునీత, ఆడె సౌంధర్య ఎంపీటీసీలు చంద్రమోళి, కొండబత్తుల రాంచందర్, ఆక్సెపల్లి లక్ష్మీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ లౌత్ సత్తయ్య, మడావి అనంతరావు. అగ్గి సత్తయ్య. ఏఓ వందన పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు ఐక్య విద్యార్థి ఉద్యమాలు

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ జాఫర్



నవతెలంగాణ-కెరమెరి

విద్యా రంగ పరిరక్షణకు ఐక్య విద్యార్థి ఉద్యమాలు చేయాల్సిన అవసరముందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాఫర్ అన్నాడు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాన్ని తిప్పికొట్టేందుకు విద్యార్థి లోకమంతా ఏకం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరిట విద్యార్థుల్లో విద్వేషాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.5,117 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయడంలో రాష్ట్ర సర్కారు తాత్సారం చేస్తుందని విమర్శించారు. ఎస్సి, ఎస్టీ హాస్టల్లో పరిస్థితి దయనీయంగా ఉందని తెలిపారు. విద్య సంవత్సరం ప్రారంభమై రూ.20 రోజులు దాటుతున్న కనీస మౌలిక వసతులు కరువయ్యాయయన్నారు. మన ఊరు-మనబడి ప్రచార ఆర్బాటం చేస్తుందని విమర్శించారు. రూ.కోట్లాది ఖర్చు చేసి దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడంలో ఉన్న శ్రద్ధ విద్యార్థులపై లేదన్నారు. విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న 24 వేల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్ విద్యాసంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కొత్తగా అనుమతించిన ప్రైవేటు యూనివర్సిటీల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలిపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు రామ్ చందర్, విజయ్, జంగు, విజయ్ పాల్గొన్నారు.

మౌలిక వసతులతో గుణాత్మక విద్య అందించాలి

- రాష్ట్ర సమగ్ర శిక్ష సంయుక్త సంచాలకుడు పి.రాజీవ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న మౌళిక వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష సంయుక్త సంచాలకుడు పి.రాజీవ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జిల్లా విద్యాధికారి అశోక్ అధ్యక్షతన నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ప్రభుత్వం ప్రభుత్వ బడుల అభివృద్ధి కోసం రెండవ దశ మన ఊరు-మన బడి పనులు ప్రారంభించనుందన్నారు. దానికంటే ముందుగానే నెలరోజుల్లోపు మొదటి దశ పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్నటువంటి ఏకరూప దుస్తులతో పాటు, పాఠ్యపుస్తకాలు సరైన సమయంలో అందించాలన్నారు. రెండో విడత అభివృద్ధి పనుల్లో భాగంగా రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉంటాయని తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ కార్యక్రమం ద్వారా జరుగుతున్న నియామకాలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. అనంతరం జిల్లా విద్యాధికారి అశోక్ మాట్లాడుతూ బుధవారం సాయంత్రంలోగా జిల్లాలోని క్యాడర్ స్ట్రెంత్ పూర్తి చేసి జిల్లా విద్యాశాఖలోని ఆఫీసులో సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ఇస్తున్న నిధులు సరైన విధంగా ఖర్చు చేసి మౌలికవసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ పెంచడంతోపాటు పాఠశాలల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏసీజీ ఉదయ బాబు, కోఆర్డినేటర్లు ఆర్.సుభాష్, ఎం.భరత్ కుమార్, సత్తయ్య జంబోజు, అబిద్ అలీ పాల్గొన్నారు.



ప్రజలు ఆదరిస్తే సిద్ధిపేట, సిరిసిల్లకు దీటుగా అభివృద్ధి చేస్తా



నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలు తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే, సిద్ధిపేట, సిరిసిల్ల నియోజకవర్గాలకు దీటుగా ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు జాన్సన్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని రేండ్లగూడ, పోన్కల్, జన్నారం, మన్నెగూడ గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్నారం పట్టణాన్ని నూతన మున్సిపాలిటీగా ఏర్పాటు చేయిస్తానన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాలను పల్లెలను అభివృద్ధి చేస్తూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపిందన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ప్రజలు తమను ఎమ్మెల్యేగా గెలిపించి, మరోసారి తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కార్యకర్తలు ప్రజలు సహకరించాలన్నారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. జన్నారం పట్టణంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం, ఫోర్ వే రోడ్డు లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, ఫజల్ ఖాన్, జక్కుల సురేష్, కే.నరసింలు, వెంకటేష్, కిష్టాపూర్ మాజీ సర్పంచ్ శ్రీధర్ల రమేష్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు శెట్టిపల్లి గంగయ్య, ఇందనపల్లి మాజీ ఉపసర్పంచ్ కాంద్రపు మల్లేష్ పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



నవతెలంగాణ-వేమనపల్లి

మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని మండల అధ్యక్షుడు బైస మల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజేవైఎం మెదక్ జిల్లా ప్రధాన కార్యాదర్శి విస్తారక్ సతీష్ పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిది సంవత్సరాల పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. రాబోవు ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని అన్నారు. అలాగే స్థానిక సమస్యలపై అధికారులు స్పందించాలని రాజారాం గ్రామంలో తాగునీటి సమస్య ఉందని తక్షణమే అధికారులు స్పందించి తాగునీటి వసతి కల్పించాలని అన్నారు. వారం రోజులుగా మండలంలో జరిగిన మేర బూత్ సబ్సే మాజ్బూత్ కార్యక్రమంపై పార్టీ శ్రేణులు ఉత్తేజంగా పనిచేసారన్నారు. సోషల్ మీడియా కన్వీనర్‌గా వేల్పుల సంజయ్‌ను ఎంపిక చేసారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఏట మధుకర్, తలండి రమేష్, ప్రధాన కార్యదర్శి గణపురం సంతోష్, మల్లేష్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కుర్మా లసయ్య, కిసాన్ మోర్చా అధ్యక్షుడు వెనుముల వెంకటేష్ చౌదరి, మధునయ్య బీజేవైఎం అధ్యక్షులు రౌత్ సుధాకర్, కొండ రవి, బింకారి నగేష్, నాయిని రవీందర్, భుదయ్యా జంపం సంతోష్, మనేపల్లి మారుతి, దుర్గం పుల్లయ్య, మడే శ్రీకాంత్ పాల్గొన్నారు.

అద్దె వాహన కాంట్రాక్టర్లతో సమావేశం



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో మంగళవారం అద్దె వాహన కాంట్రాక్టర్లతో జీఎం జి దేవేందర్ సమావేశం నిర్వహించారు. అద్దె వాహనాల నిర్వహణ సమస్యలు పరిష్కరించాలని సమ్మె నోటీసు ఇచ్చిన నేపథ్యంలో సమావేశం ఏర్పాటుచేశామని జీఎం దేవేందర్ తెలిపారు. సమావేశంలో వాహన కాంట్రాక్టర్‌లు, కాంట్రాక్టర్ల సమస్యలపై చర్చించిన అంశాలను కార్పొరేట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు, అందుకు గాను కాంట్రాక్టర్లు సానుకూలంగా స్పందించారని జీఎం తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, డీజీఎం ఎఫ్అండ్ఏ రామారావు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెర, పర్సనల్ మేనేజర్ ఐ.లక్ష్మణ్‌రావు, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, ఈఈ(పర్చెస్) రవి పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా: ఇద్దరికి గాయాలు

నవతలెంగాణ-జైనూర్

అదుపుతప్పి ఆటో బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం మండలంలోని జామిని సమీపంలో గిరిజన గురుకుల జూనియర్ కళాశాల వద్ద కూరగాయల లోడ్‌తో ఆటో వెళ్తుండగా ఎదురుగా పశువులు రావడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో భీంరావు, సంగీతకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించి జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు 108 పైలెట్ సాయి, ఈఎన్‌టీ రవి తెలిపారు.

ఉపాధ్యాయులను నియమించాలి

నవతెలంగాణ-కెరమెరి

జోడేఘాట్ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని కుంరంభీం ఉత్సవ కమిటీ మాజీ ఛైర్మన్ పెందూర్ రాజేశ్వర్ మంగళవారం డీటీడీఓని కలిసి వినతిపత్రం అందించారు. జోడేఘాట్ ఆశ్రమ యూపీఎస్ పాఠశాలలో 1 నుంచి 7 తరగతులకు గాను మొత్తం 272 విద్యార్థులున్నారని పేర్కొన్నారు. కేవలం ఇద్దరు ఎస్‌జీటీ, సీఆర్టీ ఒకరు, పీఈటీతో కలిపి నలుగురు మాత్రమే సిబ్బంది ఉన్నట్లు డీటీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. నిరుపేద ఆదివాసీ గిరిజన విద్యార్థులు నష్ట పోతున్నారని, వెంటనే విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయ సిబ్బందిని నియమించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.